సాక్షి
అనంతపురం
సోమవారం । 2 । డిసెంబర్ । 2024



టమాట కిలో రూ.33

అనంతపురం కక్కలపల్లి మండీలో ఆదివారం కిలో టమాట గరిష్ట ధర రూ.33 పలికింది. కనిష్టం రూ.20, సరాసరి రూ.26 ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.



పంపనూరు.. భక్తజన హోరు

ఆత్మకూరు మండలంలోని పంపనూరు సుబ్రహ్మణ్యేశ్వర స్వామి క్షేత్రానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. భక్తిశ్రద్ధలతో స్వామి వారిని దర్శించుకున్నారు. 8లో

గరిష్టం/కనిష్టం
31.4°/21.6°

జిల్లా అంతటా ఆదివారం తుపాను వాతావరణం నెలకొంది. ఆకాశం మేఘావృతమై అక్కడక్కడా తేలికపాటి నుంచి తుంపర్లు పడ్డాయి. వాయువ్య దిశగా గంటకు 6 నుంచి 8 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

న్యూస్‌రీల్

తనయుడిని కాపాడబోయి తండ్రి మృత్యువాత



ట్రాక్టర్ ప్రమాదంలో మృతి చెందిన రామకృష్ణ

యాడికి: తనయుడిని కాపాడే క్రమంలో తండ్రి మృత్యువాత పడిన సంఘటన మండలంలోని చింతలాయపల్లిలో ఆదివారం సాయంత్రం చోటు చేసుకుంది. స్థానికులు, కుటుంబ సభ్యులు తెలిపిన మేరకు.. చింతలాయపల్లికి చెందిన రామకృష్ణ (44)కు భార్య రాజకుళ్లాయమ్మ, ఇద్దరు కుమార్తెలు, జగదీష్ అనే కుమారుడు ఉన్నాడు. రామకృష్ణ దినసరి కూలీగా పని చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఆదివారం అదే గ్రామానికి చెందిన రామాంజనేయులుతో కలిసి ట్రాక్టర్‌లో చిన్న రాళ్లను లోడ్ చేసేందుకు కుందన కోట గ్రామ సమీపంలో గల కొండ వద్దకు కుమారుడిని వెంటబెట్టుకొని రామకృష్ణ వెళ్లాడు. రామకృష్ణ, రామాంజనేయులు ట్రాక్టర్‌లో రాళ్లను లోడ్ చేస్తుండగా జగదీష్ డ్రైవర్ సీటుపైకి ఎక్కి స్టీరింగ్ తిప్పడంతో ఒక్కసారిగా ముందుకు కదిలింది. ఈ క్రమంలోనే రామకృష్ణ పరిగెత్తుకుంటూ వెళ్లి డ్రైవర్ సీటులో ఉన్న తన కుమారుడిని ఎత్తుకొని పల్టీలు కొడుతూ కింద పడిపోయాడు. చిన్న గాయంతో బయటపడిన జగదీష్.. లే నాన్నా అని పిలిచినా ఎంత సేపటికీ రామకృష్ణ లేవలేదు. దీంతో ఆందోళన పడిన రామాంజనేయులు అక్కడే ఉన్న పలువురి సాయంతో రామకృష్ణను ఓ వాహనంలో యాడికి ఆస్పత్రికి తరలించగా.. అప్పటికే ప్రాణాలు వదిలాడని వైద్యులు తెలిపారు. దీంతో కుటుంబసభ్యులు కన్నీటి పర్యంతమయ్యారు. కాగా, ఘటనపై ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

డిజిటల్ కరెన్సీతో పారదర్శకత



జాతీయ సదస్సులో సావనీర్ ఆవిష్కరిస్తున్న సెంట్రల్ యూనివర్సిటీ వీసీ ఎస్‌ఏ కోరి

అనంతపురం: డిజిటల్ కరెన్సీతో పూర్తి పారదర్శకత ఉంటుందని, బ్లాక్ మనీకి అడ్డుకట్ట పడుతుందని సెంట్రల్ యూనివర్సిటీ వీసీ డాక్టర్ ఎస్‌ఏ కోరి అభిప్రాయపడ్డారు. ఇండియన్ కౌన్సిల్ ఫర్ సోషల్ సైన్స్ రీసెర్చ్ (ఐసీఎస్ఎస్ఆర్) సదరన్ రీజియన్, హైదరాబాద్ సహకారంతో సెంట్రల్ యూనివర్సిటీ ఆఫ్ ఏపీ వేదికగా 'డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్ అండ్ ది ఫ్యూచర్ ఆఫ్ ఇండియన్ ఎకానమీ' అంశంపై రెండు రోజుల జాతీయ సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు ఎకనామిక్స్ విభాగాధిపతి ప్రొఫెసర్ కేశవరెడ్డి కన్వీనర్‌గా వ్యవహరించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ.. అభివృద్ధి చెందిన దేశాల్లో డిజిటల్ కరెన్సీకే ఎక్కువ ప్రాధాన్యత ఉందన్నారు. ఐసీఎస్ఎస్ఆర్- ఎస్ఆర్‌సీ డైరెక్టర్ ప్రొఫెసర్ బి.సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ.. సామాజిక శాస్త్ర పరిశోధనల్లో డిజిటల్ కరెన్సీ పాత్రపై అవగాహన కల్పించారు. సెంట్రల్ యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్ ప్రొఫెసర్ దేబాసిష్ మాట్లాడుతూ.. సెంట్రల్ బ్యాంక్ డిజిటల్ కరెన్సీ, ఆటోమెటిక్ స్వీప్-ఇన్, స్వీప్ -అవుట్ ఫీచర్లు, ప్రింటింగ్, పేపర్ తయారీ ఖర్చుల తగ్గింపు, వేగవంతమైన రిమోట్ లావాదేవీలపై చైతన్య పరిచారు. జాతీయ సదస్సుకు 14 రాష్ట్రాలకు చెందిన విద్యార్థులు, ప్రొఫెసర్లు హాజరై, 74 పేపర్ ప్రజెంటేషన్లను అందజేశారు. సదస్సులో ఎస్వీ వర్సిటీ మాజీ వీసీ ప్రొఫెసర్ వీవీఎన్ రాజేంద్రప్రసాద్, సెస్ మాజీ రిజిస్ట్రార్ డాక్టర్ ఎస్.శ్రీదేవి, ఎస్కేయూ మాజీ ప్రొఫెసర్ ఎండీ బావయ్య తదితరులు ప్రసంగించారు.

చిరుత దాడిలో మరో రెండు మూగజీవాలు బలి

కుందుర్పి: చిరుత దాడిలో రెండు మూగజీవాలు మృతి చెందాయి. కుందుర్పి మండల సరిహద్దున ఉన్న కొత్తపల్లి సమీపంలో ఈ ఘటన చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన రైతులు ఈరప్ప, తిప్పన్న తమ పశువులతో పాటు మేకలను ఆదివారం ఉదయం పొలాల్లోకి మేపునకు వదిలారు. కాసేపటికే అక్కడకు చేరుకున్న ఓ చిరుత ఎద్దుపై దాడి చేసి హతమార్చింది. చుట్టుపక్కల పొలాల్లో ఉన్న రైతులు గమనించి గట్టిగా కేకలు వేస్తుండగా ఓ మేకను నోటకరుచుకుని పారిపోతూ వదిలేసింది. రెండు మూగజీవాల విలువ దాదాపు రూ.40 వేలని బాధిత రైతులు తెలిపారు. కాగా, పది రోజుల క్రితం కెంచంపల్లిలో రెండు గొర్రెలు, రెండు గేదెలను చిరుతలు పొట్టనబెట్టుకున్న విషయం తెలిసిందే. ఆరు నెలల వ్యవధిలో మండల వ్యాప్తంగా 4 గొర్రెలు, 5 మేకలు, 6 పశువులు, 4 గేదెలను చిరుతలు చంపగా... దరఖాస్తు చేసుకున్న ఏ ఒక్క రైతుకూ రూపాయి పరిహారం కూడా అందలేదు.

ధాన్యం.. ధైన్యం!

"పండించిన ప్రతి గింజను మద్దతు ధరతో కొంటాం. రాష్ట్ర వ్యాప్తంగా వేల మెట్రిక్ టన్నుల వరి ధాన్యం సేకరించాం. రైతు ఖాతాల్లోకి నగదు జమ చేస్తున్నాం..." రెండు రోజుల క్రితం బొమ్మనహాళ్ మండలం నేమకల్లులో జరిగిన సభలో సీఎం చంద్రబాబు చెప్పిన మాటలు ఇవి. కానీ, ముఖ్యమంత్రి మాటలకు, క్షేత్రస్థాయి పరిస్థితులకు పొంతన లేకుండా పోతోంది. వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటులో ప్రభుత్వం తాత్సారం చేస్తుండటంతో రైతులు గత్యంతరం లేక ధాన్యాన్ని దళారులకు అమ్ముకుంటున్నారు.

చంద్రబాబు ఉత్తుత్తి భరోసా

- మాటల్లోనే ధాన్యం కొనుగోలు
- వరి కోతలు ప్రారంభమైనా కనిపించని సేకరణ కేంద్రాలు
- అన్నదాతల్లో తుపాను భయం
- దళారులే దిక్కవుతున్న వైనం



బొమ్మనహాళ్ వద్ద వరి పంట కోత

రాయదుర్గం/బొమ్మనహాళ్: జిల్లా వ్యాప్తంగా ఈ ఖరీఫ్‌లో 21,540 హెక్టార్లలో వరి పంట సాగైంది. అత్యధికంగా కణేకల్లు మండలంలో 5,052 హెక్టార్లు, బొమ్మనహాళ్ మండలంలో 4,519, డీ హీరేహాళ్ 2,040, గార్లదిన్నె 1,676, పామిడి 1,090 హెక్టార్ల మేర సాగులోకి రాగా, మిగిలిన మండలాల్లో 7,163 హెక్టార్లలో సాగు చేశారు. సుమారు 1,35,113 మెట్రిక్ టన్నుల ధాన్యం పండుతుందని అధికారులు అంచనా వేశారు.



వరి ధాన్యం తూర్పుపోస్తున్న మహిళా రైతు

ఏవీ కొనుగోలు కేంద్రాలు..?

హెచ్ఎల్‌సీ ఆయకట్టు పొలాల్లో ఇప్పటికే వరి కోతలు ప్రారంభమయ్యాయి. అయితే, ధాన్యం కొనుగోళ్లపై మాత్రం స్పష్టత కరువైంది. ప్రభుత్వం ఇప్పటి వరకు జిల్లాలో కనీసం ఒక్క కొనుగోలు కేంద్రం కూడా ఏర్పాటు చేయలేదు. రెండు నెలల ముందే సిద్ధం చేయాల్సిన ధాన్యం కొనుగోలు పాలసీని ఇప్పటికీ ఖరారు చేయకపోవడం సర్కారు నిర్లక్ష్యానికి పరాకాష్టగా నిలుస్తోంది.

భయపెడుతున్న తుపాను..

వరి పంట కోత కోసిన రైతులను తుపాన్ ముప్పు భయపెడుతోంది. ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా ముసురేసింది. ఈ క్రమంలో కోత కోసి కల్లాల్లో కుప్పచేసిన ధాన్యాన్ని కాపాడుకునేందుకు అన్నదాతలు అగచాట్లు పడుతున్నారు. తుపాను ముంచుకొస్తోందని ముందే తెలిసినా కొనుగోలు కేంద్రాల ఏర్పాటులో ప్రభుత్వం మీనమేషాలు లెక్కించడంతో కష్టాలు వచ్చి పడ్డాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గండం నుంచి గట్టెక్కుతామో లేదో అంటూ అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు.

సొమ్ము చేసుకుంటున్న దళారులు..

రైతులకు భరోసా కల్పించడంలో సర్కారు చోద్యం చూస్తుండటం.. కల్లాల్లో ధాన్యాన్ని కాపాడుకునేందుకు అన్నదాతలు కష్టాలు పడుతుండటంతో ఇదే అదనుగా దళారులు రంగంలోకి దిగారు. రకాన్ని బట్టి క్వింటా రూ.1900, రూ.2000, రూ.2,100 లోపు కొనుగోలు చేస్తున్నారు. ఈ క్రమంలో పంట మొత్తం అమ్ముకున్నాక ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసినా పెద్ద ప్రయోజనం ఉండదని రైతులు వాపోతున్నారు. తుపాను కారణంగా ధాన్యం తడిస్తే మద్దతు ధరతో ప్రభుత్వమే కొనుగోలు చేయాలని రైతులు, రైతు సంఘాల నాయకులు డిమాండ్ చేస్తున్నారు.

ప్రభుత్వమే కొనుగోలు చేయాలి



ఈ ఏడాది మార్కెట్‌లో వరి ధాన్యం క్వింటా ధర చాలా తక్కువగా ఉంది. గతంలో బహిరంగ మార్కెట్‌లో క్వింటా రూ. 3,100 ఉండగా ప్రస్తుతం రూ.1,900 నుంచి రూ. 2,100 లోపే ఉంది. ప్రభుత్వం స్పందించి కనీస మద్దతు ధరతో రైతుల వద్ద నుంచి నేరుగా కొనుగోలు చేయాలి. – వాసుదేవరెడ్డి, ఉద్దేహాళ్ గ్రామం, బొమ్మనహాళ్ మండలం

తాత్సారం తగదు



వరి పంట కోతకు వచ్చినా కొనుగోలు కేంద్రాల ఏర్పాటులో తాత్సారం కనిపిస్తోంది. గత్యంతరం లేక రైతులు దళారులకు అమ్ముకోవాల్సి వస్తోంది. నాణ్యత పేరుతో తక్కువ ధరకే కొనుగోలు చేస్తున్నారు. పెట్టుబడులు రెట్టింపైనా గిట్టుబాటు ధర మాత్రం రావడం లేదు.
– హనుమంతు, ఉంతకల్లు గ్రామం, బొమ్మనహాళ్ మండలం

త్వరలో కొనుగోలు కేంద్రాలు

కలెక్టర్ ఆదేశాల మేరకు త్వరలో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తాం. ఏ ప్రాంతంలో ఎన్ని కేంద్రాలు ఏర్పాటు చేయాలో గుర్తించి కలెక్టర్‌కు నివేదిక అందించాం. ప్రతి గింజనూ కొనే బాధ్యతను ప్రభుత్వం తీసుకుంటుంది. రైతులు దళారులకు విక్రయించి మోసపోవద్దు. ముఖ్యంగా తుపాను ప్రభావం పూర్తిగా తగ్గే వరకు రైతులు ఎట్టి పరిస్థితుల్లో కోతలు చేపట్టరాదు.
– రమేష్‌రెడ్డి, సివిల్ సప్లయీస్ డీఎం

కొనసాగుతున్న గంజాయి బ్యాచ్ ఆగడాలు

- ప్రబోధానంద ఆశ్రమానికి చెందిన జేసీబీ డ్రైవర్‌పై దాడి



గంజాయి బ్యాచ్ దాడిలో ధ్వంసమైన జేసీబీ

తాడిపత్రి రూరల్: తాడిపత్రి పరిసరాల్లో గంజాయి బ్యాచ్ ఆగడాలు కొనసాగుతున్నాయి. తాజాగా పట్టణ సమీపంలోని పప్పూరు రోడ్డులో ఆదివారం సాయంత్రం గంజాయి సేవించిన ఆకతాయిలు రెచ్చిపోయారు. ప్రబోధానంద ఆశ్రమానికి చెందిన జేసీబీని అడ్డగించి డ్రైవర్‌ను చితకబాదారు. వివరాలు.. వైఎస్సార్ జిల్లా రైల్వే కొండాపురం మండలం బెడుదూరు గ్రామ సమీపంలోని ప్రబోధానంద ఆశ్రమానికి చెందిన తోటలో పని ముగించుకొని తాడిపత్రి మండలం చిన్న పొలమడ సమీపంలోని ఆశ్రమానికి జేసీబీ డ్రైవర్ ప్రవీణ్ కుమార్‌రెడ్డి బయలుదేరాడు. స్థానిక పప్పూరు రోడ్డులో గంజాయి బ్యాచ్ రోడ్డుకు అడ్డంగా ద్విచక్ర వాహనాలను నిలిపి ఉంచగా వాటిని పక్కకు తొలగించాలని కోరాడు. దీంతో కోపోద్రిక్తులైన వారు ప్రవీణ్‌కుమార్ రెడ్డిని చితకబాదారు. రాళ్లతో జేసీబీ అద్దాలు పగులకొట్టారు. విషయాన్ని ఫోన్ ద్వారా ప్రవీణ్ ఆశ్రమంలోని వారికి తెలియజేయగా.. హుటాహుటిన వారు అక్కడికి చేరుకున్నారు. అప్పటికే గంజాయి బ్యాచ్ అక్కడి నుంచి ఉడాయించింది. అనంతరం బాధితుడు ప్రవీణ్‌కుమార్ రెడ్డి అప్‌గ్రేడ్ స్టేషన్ సీఐ శివగంగాధర్‌రెడ్డిని కలిసి ఘటనపై ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేయనున్నట్లు సీఐ తెలిపారు.

'ఈ ప్రగతి' సేవల నిలిపివేత

అనంతపురం సెంట్రల్: రవాణా శాఖలో అన్ని రకాల వాహన సేవలు అందిస్తున్న ఈ ప్రగతి పోర్టల్‌ను సోమవారం నుంచి నిలిపివేస్తున్నట్లు ఉప రవాణా కమిషనర్ వీర్రాజు ఒక ప్రకటనలో తెలిపారు. 3వ తేదీ నుంచి వాహన్, సారథి పోర్టల్ ద్వారా మాత్రమే సేవలు పొందాలని సూచించారు.

ప్రభాకర్.. నీ ఉడత ఊపులకు భయపడం

- పశువులా ప్రవర్తిస్తే సహించేది లేదు
- ప్రాణాలు ఉంటే ఉంటాయ్.. పోతే పోతాయ్
- తాడిపత్రిలో సమావేశం ఏర్పాటు చేస్తా
- ధైర్యముంటే నీ అవినీతిపై విచారణ వేయించుకో
- 1996లో తాడిపత్రి నుంచి పరుగెత్తిపోయింది మర్చిపోయావా?
- వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి ధ్వజం



మాట్లాడుతున్న అనంత వెంకటరామిరెడ్డి

అనంతపురం కార్పొరేషన్: తాడిపత్రి మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్ రెడ్డి ఉడత ఊపులకు భయపడేది లేదని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి స్పష్టం చేశారు. 'ప్రాణాలు ఉంటే ఉంటాయ్..పోతే పోతాయి. పార్టీ కార్యకర్తలు, నాయకులు, ప్రజాస్వామ్యాన్ని కాపాడుకునేందుకు తాడిపత్రిలోనే సమావేశం ఏర్పాటు చేస్తాం. వీలైతే ఆ సమావేశానికి మాజీ సీఎం వైఎస్ జగన్ కూడా వస్తారు' అని ఆయన అన్నారు. అనంతపురంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కూటమి ప్రభుత్వంలో శాసనసభ్యులే ఇసుక, మట్టి, మద్యం, బూడిద ఆదాయాల కోసం కొట్లాడుకుంటున్నారన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో నెలకొన్న ఈ విషయాన్నే తాను చెప్పానన్నారు. మీడియా సాక్షిగా సాక్షాత్తూ సీఎం చంద్రబాబు కూడా ఇదే విషయం చెప్పారని గుర్తు చేశారు. కానీ సభ్య సమాజం తల దించుకునేలా వావివరసలు మరచి తాడిపత్రి మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్ రెడ్డి తనపై వ్యాఖ్యలు చేశారన్నారు.

పశువుల కంటే హీనంగా ప్రవర్తిస్తారా?

'1967 నుంచి రాజకీయాల్లో ఉన్నాం. నాలుగుసార్లు ఎంపీగా, ఒకసారి శాసన సభ్యుడిగా ఎన్నికయ్యా. ఏనాడూ అవినీతి, అక్రమాలు, దౌర్జన్యాలకు పాల్పడలేదు. 1967లో మా తండ్రి కట్టించిన నివాసంలోనే ఉంటున్నాం. ఆ ఇంట్లోనే మీ కుటుంబ సభ్యులు నిద్ర చేసిన విషయాన్ని మర్చిపోవద్దు. మా తల్లిదండ్రులు, గురువులు మాకు సంస్కారం నేర్పారు. ఎవరెన్ని విమర్శలు చేసినా వాటిని స్వీకరించి తప్పులుంటే సరిదిద్దుకున్నా. అలా కాకుండా జేసీ ప్రభాకర్ రెడ్డి నాపై ఇష్టారాజ్యంగా మాట్లాడారు. నా ఇంటికి వచ్చి కొడతామని అంటున్నారు. అది అంత సులభం కాదని ఆయన గుర్తుంచుకోవాలి. పశువుల కంటే హీనంగా ప్రవర్తిస్తే సహించేది లేద'ని అనంత స్పష్టం చేశారు.

1996లో పరుగెత్తిపోయారు..

'నేను గెలిచినా, ఓడినా జిల్లా కేంద్రంలోని నా ఇంట్లోనే ఉన్నా. మీలా గెలిచినప్పుడు ఢిల్లీ, హైదరాబాద్‌లో ఉండటం, ఓడినప్పుడు బెంగళూరుకు పరుగెత్తడం చేయలేదు. ఎన్నికల్లో ఓడాక గన్‌మెన్‌లను తొలగించినా మళ్లీ కావాలని అడగలేదు. 1996లో రాష్ట్రంలో అధికారంలో లేనప్పుడు అందరూ బెంగళూరుకు మకాం మార్చి వ్యాపారాలు, సంసారాలు చేసుకున్నారు. అప్పట్లో రఘువీరారెడ్డి, నేను పోరాడాం. వామపక్షాలు కూడా ప్రజాస్వామ్య పరిరక్షణకు ఆ రోజుల్లో నిలబడ్డాయి. తాడిపత్రిలోనూ పార్టీని కాపాడాం. 2004 తర్వాతే మళ్లీ మీరు వచ్చారు' అని ఆయన తెలిపారు.

మాఫియాను తయారు చేస్తున్నారు..

జిల్లాలోనే రైతాంగం అత్యధికంగా ఉండే తాడిపత్రి నియోజకవర్గంలో మాఫియాను జేసీ ప్రభాకర్ రెడ్డి తయారు చేస్తున్నారని అనంత మండిపడ్డారు. ఇలాంటి మాఫియా జిల్లాకే కాకుండా జేసీ ప్రభాకర్ రెడ్డికి కూడా హానికరమేనని, అటువంటి మాఫియా ఆగడాలకు తావివ్వబోమని స్పష్టం చేశారు. 'పత్రికల్లో వార్తలు రాస్తే బెదిరిస్తారు. ఐఏఎస్, ఐపీఎస్, తదితర అధికారులపైనా దౌర్జన్యం చేస్తారు. అందరిలా మమ్మల్ని బెదిరిస్తామంటే ఊరుకునేది లేదు' అని హెచ్చరించారు.

విచారణకు సిద్ధమా..?

కేంద్ర ప్రభుత్వంలో నేడు టీడీపీ కూడా భాగస్వామిగా ఉందని, దమ్ముంటే తనపై చేసిన ఆరోపణలను నిరూపించాలని అనంత సవాల్ విసిరారు. అదే క్రమంలో ధైర్యముంటే మీ ఆస్తులు, కుటుంబంపై విచారణ వేసుకోవాలని జేసీ ప్రభాకర్ రెడ్డికి సూచించారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఎన్ని అడ్డంకులు సృష్టించినా రూ.1,045 కోట్ల అభివృద్ధి పనులు చేపట్టిన విషయాన్ని గుర్తు చేశారు. గత టీడీపీ హయాంలో రామ్‌నగర్ బ్రిడ్జ్ పనులను తెలిసిన కాంట్రాక్టర్‌తో జేసీ కుటుంబం చేయించిందన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో నిర్మించిన అనంతపురం రైల్వే ఓవర్ బ్రిడ్జ్, గతంలో నిర్మించిన రామ్‌నగర్ బ్రిడ్జ్ ఎలా ఉందో ఒకసారి చూడాలన్నారు. ఆర్‌ఓబీ పనులు చేసిన కాంట్రాక్టర్ టీడీపీలోనే ఉన్నారని, వాస్తవాలు తెలుసుకుని మాట్లాడాలని హితవు పలికారు. డంపింగ్ యార్డుపై విచారణ చేసుకోవాలని మునిసిపల్ సమావేశంలో ఎప్పుడో తమ మేయర్ వసీం కోరారని గుర్తు చేశారు.

మాటలకే పరిమితం కావద్దు..

ఏరు దాటే వరకు ఓడ మల్లన్న, ఏరు దాటాక బోడి మల్లన్న అనే రకంగా చంద్రబాబు తీరు ఉంటుందని దివంగత నేత వైఎస్సార్ చెప్పేవారని అనంత గుర్తు చేశారు. గతంలో చంద్రబాబు సీఎంగా ఉన్న సమయంలో హంద్రీనీవా ద్వారా 40 టీఎంసీలు, 5 టీఎంసీలు చేస్తామని రెండు టర్మ్‌లు పూర్తి చేశారని విమర్శించారు. దివంగత నేత వైఎస్సార్ సీఎంగా ఉన్నప్పుడే హంద్రీనీవా పనులు వేగంగా సాగాయని, 2012 నుంచి కృష్ణా జలాలు జిల్లాకు వస్తున్నాయని చెప్పారు. 5 టీఎంసీల సామర్థ్యంతో ఉంతకల్లు రిజర్వాయర్ నిర్మాణంతో పాటు హెచ్ఎల్‌సీ ఆధునీకరణకు చర్యలు తీసుకుంటామని ఇచ్చిన హామీలను చంద్రబాబు నిలబెట్టుకోవాలన్నారు. ఇప్పుడున్న సాంకేతిక పరిజ్ఞానంతో ఉంతకల్లు రిజర్వాయర్‌ను రెండున్నరేళ్లలో పూర్తి చేయవచ్చన్నారు. సూపర్ సిక్స్ హామీలను కూడా తక్షణం అమలు చేయాలని డిమాండ్ చేశారు.

విహారయాత్రలో విషాదం

- విడపనకల్లు వద్ద కారు ప్రమాదం
- ఇద్దరు వైద్యులు, వ్యాపారి మృతి
- మరో వైద్యునికి తీవ్రగాయాలు



మృతిచెందిన డాక్టర్ యోగీష్, గోవిందరాజులు, వెంకటనాయుడు

సాక్షి, బళ్లారి/బళ్లారి రూరల్/విడపనకల్లు: పని ఒత్తిడి నుంచి బయటపడేందుకు వారంతా ఏడాదికోసారి విదేశాలకు విహారయాత్రగా వెళ్లేవారు. ఈ ఏడాది కూడా అలా వెళ్లిన వారు ఎంతో సంతోషంగా తిరిగి ఇళ్లకు వెళ్తుండగా మృత్యువు పంజా విసిరింది. రోడ్డు ప్రమాదం రూపంలో ప్రాణాలు కబళించింది. ఆదివారం విడపనకల్లు వద్ద కారు చెట్టును ఢీకొనడంతో ముగ్గురు మృతి చెందిన ఘటన విషాదం నింపింది.

ఇద్దరు ప్రముఖ డాక్టర్లు..

ప్రమాదంలో మరణించిన డాక్టర్ గోవిందరాజులు (54) బళ్లారి వైద్య కళాశాల ఆస్పత్రిలో ప్రముఖ క్యాన్సర్ శస్త్రచికిత్స నిపుణులు. మరో డాక్టర్ యోగీష్ (53) ఆప్తమాలజీ డిపార్ట్‌మెంట్ ఇన్‌చార్జ్. వీరితో పాటు వ్యాపారి వెంకటనాయుడు (45) మృతి చెందగా, మరో వైద్యుడు అమర గౌడ పాటిల్ (55) తీవ్రంగా గాయపడ్డారు. కాగా, డాక్టర్ గోవింద రాజులు భార్య రచన డెంటల్ డాక్టర్‌గా పనిచేస్తున్నారు. వైద్య విద్యనభ్యసిస్తున్న ఇద్దరు కుమార్తెలు వీరికి సంతానం. డాక్టర్ యోగీష్ భార్య విజయలక్ష్మీ కూడా డెంటల్ డాక్టర్ అని తెలిసింది. వీరికి ఇద్దరు కుమారులున్నారు. ఒకరు ఎంబీబీఎస్ చదువుతున్నారు.

అరగంటలో ఇంటికి చేరతామనేలోపే..

గోవిందరాజులు, యోగీష్, అమరగౌడ పాటిల్, వెంకటనాయుడులు నాలుగు రోజుల హాంకాంగ్ యాత్ర ముగించుకుని బెంగళూరు దేవనహళ్లి విమానాశ్రయంలో దిగి కారులో బళ్లారికి బయలుదేరారు. మరో అర గంటలో బళ్లారికి చేరుతామనుకునేలోపే కారు అదుపుతప్పి చెట్టును ఢీకొంది. దీంతో ముగ్గురు అక్కడికక్కడే మృతి చెందారు. అమరగౌడ పాటిల్ తీవ్రంగా గాయపడ్డారు. స్థానిక పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని మృతదేహాలను వెలికితీసి బళ్లారి విమ్స్ ఆస్పత్రికి తరలించారు. కారు అమరగౌడ పాటిల్‌కు చెందినది కాగా, డా.గోవిందరాజులు డ్రైవింగ్ చేస్తున్నారు.



ప్రమాదంలో నుజ్జునుజ్జయిన కారు

బిమ్స్.. శోకసంద్రం

విహారయాత్రకు వెళ్లిన తమ వారు కానరాని లోకాలకు వెళ్లారని తెలుసుకున్న మృతుల కుటుంబీకులు కన్నీరుమున్నీరుగా విలపించారు. బిమ్స్ మార్చురీ వద్ద కుటుంబ సభ్యులతో పాటు మృతులు బంధువులు, స్నేహితులు, స్థానిక వైద్యులు విషాదంలో మునిగిపోయారు. బీజేపీ నేత ఆర్ అశోక్, గంగావతి ఎమ్మెల్యే గాలి జనార్దనరెడ్డి, మాజీ మంత్రి శ్రీరాములు బాధిత కుటుంబాలను పరామర్శించారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాలకు వారి స్వస్థలాల్లో అంత్యక్రియలు పూర్తి చేశారు.



దీపాలు వెలిగిస్తున్న భక్తులు



శివలింగం ఆకృతిలో వెలిగించిన కార్తీక దీపాలు

నేత్రపర్వం.. కార్తీక దీపోత్సవం

ఉరవకొండ: కార్తీక మాస చివరి ఆదివారాన్ని పురస్కరించుకుని ప్రసిద్ధ శైవక్షేత్రం ఉరవకొండ గవిమఠం శోభాయమానంగా మారింది. చంద్రమౌళీశ్వరస్వామి సన్నిధిలో నిర్వహించిన లక్ష దీపోత్సవంలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. భక్తిశ్రద్ధలతో దీపాలు వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు. అంతకు ముందు చంద్రమౌళీశ్వర స్వామికి విశేష పూజలు, అభిషేకాలు నిర్వహించారు. కార్యక్రమంలో గవిమఠం ఉత్తరాధికారి డాక్టర్ కరిబసవరాజేంద్రస్వామి, ఎస్‌ఐ జనార్దన్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

అలరించిన హనుమంతుని లీలా వైభవం

ప్రశాంతి నిలయం: పర్తియాత్రలో భాగంగా పుట్టపర్తికి విచ్చేసిన హైదరాబాద్ సత్యసాయి భక్తులు ఆదివారం సత్యసాయి మహాసమాధి చెంత సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఉదయం కర్ణాటక సంగీత విద్వాంసురాలు సౌమ్యా వారణాసి చక్కటి భక్తిగీతాలను ఆలపిస్తూ నిర్వహించిన కచేరీ భక్తులను మైమరపించింది. సాయంత్రం సత్యసాయి బాలవికాస్ విద్యార్థులు ప్రదర్శించిన 'హనుమంతుని లీలా వైభవం' నృత్య రూపకం అలరించింది. రామాయణ పురాణ ఇతిహాసం ఆధారంగా హనుమంతుని గుణగణాలను వివరించే పలు ఘట్టాలను ప్రదర్శించారు.



నృత్య రూపకంలోని ఒక ఘట్టం

మొబైల్ ఐ క్లినిక్ వాహనం ప్రారంభం..

పర్వత ప్రాంతాలైన హిమాలయాలలోని లద్దాఖ్‌తో పాటు చండీఘర్, హర్యాణ తదితర ప్రాంతాల ప్రజలకు కంటి వైద్య సేవలు అందించే లక్ష్యంతో సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ నూతన మొబైల్ ఐ క్లినిక్ వాహనాన్ని ఆదివారం సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జె.రత్నాకర్ రాజు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అభాగ్యులకు సేవలు అందించే లక్ష్యంతో సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ పని చేస్తోందన్నారు.

క్లుప్తంగా

జీసీటీఏ జిల్లా అధ్యక్షుడిగా కోనంకి శ్రీధర్

- కార్యదర్శిగా ఎం.బాలాజీ నాయక్


కోనంకి శ్రీధర్


బాలాజీ నాయక్

అనంతపురం ఎడ్యుకేషన్: ప్రభుత్వ డిగ్రీ కళాశాలల అధ్యాపకుల సంఘం (జీసీటీఏ) జిల్లా అధ్యక్షుడిగా డాక్టర్ కోనంకి శ్రీధర్, కార్యదర్శిగా బాలజీ నాయక్ ఎన్నికయ్యారు. ఆదివారం స్థానిక ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో సంఘం జిల్లా కమిటీ ఎన్నికలు జరిగాయి. పోటీ నెలకొన్న అధ్యక్ష పదవికి ఎన్నికలు నిర్వహించారు. 50 ఓట్ల మెజార్టీతో వెంకటేష్‌పై కోనంకి శ్రీధర్ గెలుపొందారు. అలాగే మహిళా విభాగం కార్యదర్శి పదవికి ఎన్నికలు నిర్వహించగా 28 ఓట్లతో విష్ణుప్రియపై డాక్టర్ శ్రీలేఖ విజయం సాధించారు. జిల్లా కార్యదర్శిగా బాలాజీ నాయక్, ట్రెజరర్‌గా డాక్టర్ నాగరాజును ఏకగ్రీకంగా ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారిగా పెనుకొండ ప్రభుత్వ కళాశాల అధ్యాపకుడు డాక్టర్ జయప్ప వ్యవహరించారు. జీసీటీఏ నూతన కమిటీ సభ్యులను ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ పద్మశ్రీ అభినందించారు.

ఐదు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల ధ్వంసం


చందనలో దుండగులు ధ్వంసం చేసిన ట్రాన్స్‌ఫార్మర్

యాడికి: వ్యవసాయ పొలాల్లో పంటల సాగుకు అనుకూలంగా రైతులు ఏర్పాటు చేసుకున్న 5 విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను దుండగులు ధ్వంసం చేసి, అందులోని కాపర్ వైర్, ఆయిల్‌ను అపహరించారు. యాడికి మండలం చందన గ్రామంలో శనివారం రాత్రి ఈ ఘటన చోటు చేసుకుంది. గ్రామ సమీపంలో రైతు పాపిరెడ్డి గారి సూర్యనారాయణరెడ్డి తోటలో ఓ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్, నంద్యాల రంగమ్మకు చెందిన తోటలోని రెండు, పైలా రంగారెడ్డికి చెందిన తోటలోని రెండు విద్యుత్ ట్రాన్స్‌పార్మర్లను ధ్వంసం చేశారు. ఆదివారం ఉదయం పొలాలకు వెళ్లిన రైతులు విషయాన్ని గుర్తించి సమాచారం ఇవ్వడంతో పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. ఘటనతో దాదాపు రూ.3 లక్షల మేర నష్టపోయినట్లు బాధిత రైతులు తెలిపారు. బాధిత రైతుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

పంపనూరు.. భక్తజన హోరు


బంగారు కవచ అలంకరణలో సుబ్రహ్మణ్యేశ్వరుడు


ప్రత్యేక అలంకరణలో మంజునాథుడు

ఆత్మకూరు: కార్తీక మాసంలో ఆఖరి ఆదివారం కావడంతో ఆత్మకూరు మండలం పంపనూరులోని సుబ్రహ్మణ్యేశ్వర స్వామి క్షేత్రానికి భక్తులు పోటెత్తారు. సుబ్రహ్మణ్యేశ్వరస్వామి వారి దర్శనానికి గంటల సమయం పట్టింది. కాల సర్పదోష నివారణ రాహు కేతు హోమాలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో కార్తీక దీపాలు వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయంలోని మంజునాథస్వామి, పార్వతీ దేవికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.


ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్న భక్తులు

వెంకటాపురంలో టీడీపీ నేతల దౌర్జన్యం

- హైకోర్టు ఆదేశాలు బేఖాతర్ చేస్తూ వైఎస్సార్‌సీపీ నేత ఆస్తుల ధ్వంసం
- బీకేఎస్ పోలీసుల ప్రేక్షక పాత్ర


పోలీసుల సమక్షంలోనే బండలను ధ్వంసం చేస్తున్న దృశ్యం

బుక్కరాయసముద్రం: కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత బీకేఎస్ మండలంలో టీడీపీ నేతల దౌర్జన్యాలు పెచ్చుమీరాయి. ఆదివారం వైఎస్సార్‌సీపీ నాయకుడి ఇంటిపైకి దాడి చేసి ఆస్తుల విధ్వంసానికి తెగబడ్డారు. వివరాలు... వెంకటాపురం గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు వెంకటనారాయణరెడ్డి గతంలో సర్వే నంబర్ 276, 278లో 5.50 సెంట్లు కొనుగోలు చేసి, ఇల్లు నిర్మించుకున్నాడు. ఈ క్రమంలో ఇంటి చుట్టూ బండలు నాటుకున్నాడు. వెంకట నారాయణరెడ్డి ఇంటి పక్కనే టీడీపీ నేత నాగరాజు ఇల్లు ఉంది. నాగరాజు ఇంటికి దక్షిణం వైపు ప్రధాన రస్తా ఉంది. అయితే వెంకటనారాయణరెడ్డి కొనుగోలు చేసిన స్థలంలో తూర్పు వైపు రస్తా కావాలని కొన్నేళ్లుగా గొడవ పడుతూ ఉన్నాడు. ఈ క్రమంలో ఐదేళ్ల క్రితం గ్రామంలో పోలీస్ పికెట్ ఉన్నా.. తన అనుచరులు 11 మందితో కలసి వెంకటనారాయణరెడ్డి ఇంటి చుట్టూ ఉన్న బండలను ధ్వంసం చేశాడు. దీంతో అప్పట్లో వారిపై కేసు నమోదైంది. నేటికీ ఆ కేసు వాదనాలు న్యాయస్థానంలో కొనసాగుతున్నాయి.

విందు పేరుతో విధ్వంసం...

వెంకటాపురంలో టీడీపీ నాయకుడు అక్కులప్ప ఆదివారం పొట్టేళ్ల కోసి విందు ఏర్పాటు చేశాడు. టీడీపీ నాయకులతో పాటు కురుబ సంఘం నాయకులు పెద్ద ఎత్తున హాజరయ్యారు. ఈ క్రమంలో నాగరాజు, అక్కులప్ప ముందస్తు ప్రణాళిక రూపొందించుకుని 6 ఏళ్ల క్రితం ఉన్న రస్తా సమస్యను తెరపైకి తెచ్చి విందు అనంతరం అందరినీ రెచ్చగొట్టి వెంకటనారాయణరెడ్డి ఇంటి చుట్టూ ఉన్న బండలను ధ్వంసం చేయించారు.

ప్రేక్షక పాత్రలో పోలీసులు..

వెంకటాపురంలో విందు కార్యక్రమానికి పోలీసులూ పెద్ద ఎత్తున హాజరయ్యారు. అయితే వివాదం తలెత్తే అవకాశం ఉందని భావించిన టీడీపీ ప్రజాప్రతినిధులు అటుగా కన్నెత్తి కూడా చూడలేదు. విందు అనంతరం టీడీపీ నాయకులు దౌర్జన్యం సాగిస్తున్నా 50 మంది పోలీసులు కేవలం ప్రేక్షకులుగానే మిగిలిపోయారు. జిల్లా, హైకోర్టు పరిధిలో స్థల వివాదం ఉందని, ఈ అంశంలో తనకు అనుకూలంగా హైకోర్టు స్టే ఆర్డర్ ఇచ్చిందిని తెలిపినా వినలేదు. జరిగిన నష్టాన్ని ఎస్పీ, కలెక్టర్, హెచ్‌ఆర్‌సీ దృష్టికి తీసుకెళ్లనున్నట్లు బాధితుడు పేర్కొన్నాడు.

పీఆర్సీ వెంటనే ప్రకటించాలి

- పీఆర్టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.గిరిధర్‌రెడ్డి

అనంతపురం ఎడ్యుకేషన్: ఉద్యోగ, ఉపాధ్యాయులకు సంబంధించి పీఆర్సీ వెంటనే ప్రటించాలని ప్రభుత్వాన్ని ప్రొగ్రెస్సివ్ రికగ్నైజ్డ్ టీచర్స్ యూనియన్ (పీఆర్టీయూ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.గిరిధర్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం అనంతపురం వేదికగా పీఆర్టీయూ ఉమ్మడి జిల్లా కౌన్సిల్ సమావేశం జరిగింది. ముఖ్య అతిథిగా ఎం.గిరిధర్‌రెడ్డి హాజరై, మాట్లాడారు. 30 శాతం ఐఆర్ ప్రకటించాలన్నారు. ఉపాధ్యాయులపై యాప్‌ల భారం తగ్గించాలని డిమాండ్ చేశారు. పని వేళలు ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఉండేలా చూడాలన్నారు. వివిధ సమస్యలపై సుదీర్ఘంగా చర్చించి పలు తీర్మానాలను ఆమోదించారు.

రెండు జిల్లాలకు నూతన కార్యవర్గం..

ఈ సందర్భంగా అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లా కమిటీలకు నూతన కార్యవర్గాలను ఎన్నుకున్నారు. అనంతపురం జిల్లా అధ్యక్షుడిగా టి.పురుషోత్తంరెడ్డి, ప్రధానకార్యదర్శిగా తిమ్మారెడ్డి, శ్రీసత్యసాయి జిల్లా అధ్యక్షుడిగా బి.రామకృష్ణారెడ్డి, ప్రధాన కార్యదర్శిగా టి.చంద్రశేఖర్‌రెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎన్నికల పరిశీలకులుగా సీనియర్ నాయకులు ఎన్.విష్ణువర్ధన్‌రెడ్డి, ఈ.శ్రీరాములు వ్యవహరించారు.

విద్యుదాఘాతంతో యువకుడి మృతి

- నెల రోజుల క్రితం షాక్
- ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి


చిట్రా శివ (ఫైల్)

కూడేరు: విద్యుత్ షాక్‌కు గురైన యువకుడు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. కూడేరు మండలం చోళసముద్రానికి చెందిన చిట్రా శివ(26) ప్రైవేట్ విద్యుత్ హెల్పర్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. గత నెల 2న ఓ రైతు పొలంలో మరమ్మతుల కోసం వెళ్లిన ఆయన షాక్‌కు గురై, తీవ్రంగా గాయపడ్డాడు. దీంతో కుటుంబసభ్యులు అనంతపురంలోని సర్వజనాస్పత్రిలో చేర్పించారు. చికిత్సకు స్పందించక ఆదివారం ఉదయం ఆయన మృతిచెందాడు. కాగా, శివకు భార్య ఆశ, ఏడు నెలల వయసున్న కుమార్తె ఉన్నారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

మృతదేహంతో ఆందోళన..

పోస్టుమార్టం అనంతరం శివ మృతదేహాన్ని కుటుంబ సభ్యులు, బంధువులు రైతు నాగరాజు ఇంటి ముందు ఉంచి ఆందోళనకు దిగారు. విద్యుత్ శాఖ అధికారుల నుంచి ఎలాంటి అనుమతి తీసుకోకుండా శివాను నమ్మించి పిలుచుకెళ్లాడని, మరమ్మతులు చేస్తుండగా విద్యుత్ సరఫరా కావడంతోనే ప్రమాదం చోటు చేసుకుని శివ మృతి చెందాడంటూ కుటుంబసభ్యులు ఆరోపించారు. పరిహారం చెల్లించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని ఆందోళన కారులతో మాట్లాడారు. వ్యక్తిగత పనిపై మరో గ్రామానికి వెళ్లిన నాగరాజు రాగానే మాట్లాడి న్యాయం చేస్తామంటూ సర్దిచెప్పినా బాధితులు వినలేదు. తమకు న్యాయం జరిగే వరకూ అక్కడి నుంచి మృతదేహాన్ని తీసుకెళ్లబోమంటూ భీష్మించారు.

ప్రజా సంపదను దోచేస్తున్న బాబు


మాట్లాడుతున్న తలారి రంగయ్య, పార్టీ నాయకులు

- అధికారంలోకి రాగానే రెండు సార్లు విద్యుత్ చార్జీల పెంపు
- బీటీపీపై గాలి మాటలు
- కళ్యాణదుర్గం వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త తలారి రంగయ్య ధ్వజం

కళ్యాణదుర్గం: రాష్ట్రంలో సంపద సృష్టిస్తానంటూ ఎన్నికల సమయంలో చెప్పిన చంద్రబాబు... అధికారం చేపట్టిన విద్యుత్ ఛార్జీలు పెంచి రాష్ట్ర ప్రజల సంపదను దోచేస్తున్నారని మాజీ ఎంపీ, కళ్యాణదుర్గం వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త డాక్టర్ తలారి రంగయ్య మండిపడ్డారు. స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఆ పార్టీ నేతలతో కలసి ఆదివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. విద్యుత్ చార్జీలు పెంచబోమంటూనే అధికారంలోకి వచ్చిన ఈ ఆరు నెలల్లోనే రెండు సార్లు విద్యుత్ ఛార్జీలను చంద్రబాబు పెంచారన్నారు. ఫలితంగా రూ.15,486 కోట్ల భారాన్ని ప్రజలపై మోపారన్నారు. విద్యుత్ రంగం సంక్షోభంలో కూరుకుపోవడానికి చంద్రబాబే కారణమన్నారు. రాయలసీమ జిల్లాల్లో ఏకంగా రూ.1,117 కోట్ల విద్యుత్ ఛార్జీల వసూళ్లకు ప్రభుత్వం ఆదేశాలివ్వడం సిగ్గుచేటన్నారు. సూపర్ సిక్స్ పథకాలను ఎగొట్టడంతో పాటు గత ప్రభుత్వ పథకాలనూ నిర్వీర్యం చేశారని దుయ్యబట్టారు. ఇటీవల నేమకల్లుకు వచ్చిన సీఎం చంద్రబాబు నేమకల్లు సాక్షిగా బీటీపీ పూర్తి చేస్తామని చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. స్థానిక ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు పలు మార్లు బీటీపీ గురించి ముఖ్యమంత్రితో చర్చించడమనేది కేవలం కంటి తుడుపేనన్నది అక్షర సత్యమన్నారు. కాంట్రాక్టర్ ఆయనే కాగా, ప్రభుత్వం కూడా వారిదే ఉన్నా... బీటీపీ నుంచి గంప మట్టి కూడా ఎత్తలేని పరిస్థితిల్లో ఉన్నారని విమర్శించారు. నియోజకవర్గ ప్రజలపై టీడీపీ నేతలకు చిత్తశుద్ధి ఉంటే వెంటనే బీటీపీ పనులు ప్రారంభించాలని హితవు పలికారు. సమావేశంలో పార్టీ పట్టణ కన్వీనర్ గోపారం శ్రీనివాసులు, మున్సిపల్ చైర్మన్ రాజ్‌కుమార్, నాయకులు చంద్రశేఖర్‌రెడ్డి, గోళ్ల సూరి, కిరీటి యాదవ్, యర్రంపల్లి కృష్ణమూర్తి, లాయర్ హనుమంతరెడ్డి, రామాంజినేయులు, కౌన్సిలర్ లక్ష్మన్న, కో ఆప్షన్ సభ్యుడు అప్జల్, గణేష్, భీమేష్, గంగాధర, ఎంపీటీసీ శివన్న, దేవపుత్ర, మంజునాథ్, రవికుమార్, ధనుంజయ, మల్లి, ప్రతాప్, బిక్కి హరి, నరసింహులు, చరణ్, చిరు, గంగాధర్, ఉమేష్, పాండు, రామిరెడ్డి, ఉమేష్ రెడ్డి, ఓబులేసు, మోహన్, జానీ, తదితరులు పాల్గొన్నారు.

ప్రజలపై ఆర్థిక భారం తగదు

- ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి



ఉరవకొండ: మార్కెట్లో నిత్యావసర సరుకుల ధరలు ఇప్పటికే సామాన్యుడికి అందనంత ఎత్తుకు చేరుకున్నాయని, తాజాగా ట్రూఅప్ ఛార్జీల పేరుతో మోయలేని విధంగా విద్యుత్ చార్జీలను పెంచి ప్రజల నడ్డిని కూటమి సర్కార్ విరిచిందంటూ శాసనమండలి ప్రివిలేజ్ కమిటీ చైర్మన్, ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి ధ్వజమెత్తారు. ఆదివారం వజ్రకరూరు మండలం కొనకొండ్లలోని తన స్వగృహంలో ఏర్పాటు చేసి విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సర్దుబాటు పేరుతో రూ.15,485 కోట్ల భారాన్ని ప్రజలపై మోపడం సబబు కాదన్నారు. ఎన్నికల సమయంలో విద్యుత్‌చార్జీలు పెంచబోమని స్పష్టమైన హామీనిచ్చిన కూటమి పెద్దలు అధికారం చేపట్టిన ఈ ఆరు నెల కాలంలోనే రెండు సార్లు విద్యుత్ చార్జీలు పెంచారన్నారు. ఉచిత పంటల బీమా పథకానికి మంగళం పాడేసి వ్యవసాయాన్ని నిర్వీర్యం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతుల బాగోగులను ప్రభుత్వం ఏమాత్రం పట్టించుకోవడం లేదన్నారు. పంట నష్టం జరిగితే పరిహారం చెల్లించకుండా ఉండేందుకు ఈ-క్రాప్ నమోదు ప్రక్రియను ఆపేశారని మండిపడ్డారు. ఇచ్చిన హామీలపై స్పష్టత ఇవ్వకుండా పేద, మధ్య తరగతి ప్రజల నడ్డి విరిచేలా పాలన సాగిస్తున్న కూటమి ప్రభుత్వానికి సరైన గుణపాఠం చెప్పే సమయం త్వరలో వస్తోందన్నారు.

పెంచిన విద్యుత్ చార్జీలు తగ్గించాలి

- మాజీ ఎమ్మెల్యే విశ్వ డిమాండ్



ఉరవకొండ: సీఎం చంద్రబాబు విధానాలతోనే విద్యుత్ శాఖ సంక్షోభంలో కూరుకుపోయిందని ఉరవకొండ నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి మండిపడ్డారు. ఆదివారం అనంతపురంలోని తన స్వగృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల సమయంలో విద్యుత్ చార్జీలు పెంచబోమంటూ హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన ఈ ఆరు నెలల్లోనే రెండు సార్లు పెంచి ప్రజలను మోసగించారన్నారు. ఇంధనసర్దుబాటు చార్జీల పేరుతో తాజాగా రూ.9వేల కోట్లు, దీపావళికి రూ.6,072 కోట్లు మొత్తం రూ.15,485 కోట్ల మేర భారాన్ని రాష్ట్ర ప్రజలపై చంద్రబాబు మోపారని మండిపడ్డారు. రాష్ట్రంలో ప్రజలకు సంపద సృష్టించడం అంటే ప్రజలపై ఆర్థిక భారం మోపడం కాదన్నారు. విద్యుత్ చార్జీలు చెల్లించలేక ప్రజలను అప్పుల పాలయ్యే పరిస్థితుల్లోకి నెట్టేశారంటూ ధ్వజమెత్తారు. కూటమి సర్కార్ ఏర్పాటైన ఈ కొద్ది రోజుల్లోనే ప్రజల నెత్తిన రూ.67,237 కోట్ల అప్పుల భారాన్ని మోపారని విమర్శించారు.


హెచ్‌ఐవీ నిర్మూలనకు కృషి చేయాలి

- ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ


ర్యాలీని ప్రారంభిస్తున్న ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ, డిప్యూటీ మేయర్లు కోగటం, వాసంతి

అనంతపురం కార్పొరేషన్: జిల్లాలో హెచ్‌ఐవీ తగ్గుముఖం పట్టిందని ఉదాసీనంగా వ్యవహరించకుండా పూర్తి స్థాయిలో నిర్మూలనకు ప్రతి ఒక్కరూ బాధ్యతతో పనిచేయాలని ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ పిలుపునిచ్చారు. ప్రపంచ ఎయిడ్స్ దినాన్ని పురస్కరించుకుని ఆదివారం ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ర్యాలీని జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మతో కలసి ఆయన ప్రారంభించారు. ఆర్ట్స్ కళాశాల నుంచి సప్తగిరి సర్కిల్ వరకూ ర్యాలీ సాగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. అవగాహనతోనే హెచ్‌ఐవీ నివారణ సాధ్యమన్నారు. ఆ దిశగా ప్రజల్లో చైతన్యం తీసుకురావాలని వైద్య ఆరోగ్యశాఖకు సూచించారు. జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ మాట్లాడుతూ... హెచ్‌ఐవీతో జీవిస్తున్న వారికి మెరుగైన వైద్య సేవలందించాలన్నారు. డీఎంహెచ్‌ఓ డాక్టర్ భ్రమరాంబదేవి మాట్లాడుతూ... హెచ్‌ఐవీ నివారణలో ఉమ్మడి అనంతపురం జిల్లాకు నాలుగు రాష్ట్ర స్థాయి అవార్డులు దక్కడంపై హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్లు కోగటం విజయభాస్కర్ రెడ్డి, వాసంతి సాహిత్య, జిల్లా ఎయిడ్స్ నియంత్రణ అధికారి డాక్టర్ అనుపమజేమ్స్, వైద్యులు డాక్టర్ గంగాధర్ రెడ్డి, ఎయిడ్స్ నియంత్రణ విభాగం సిబ్బంది జీవీ రమణ, ఐసీడీఎస్ పీడీ డాక్టర్ శ్రీదేవి, తదితరులు పాల్గొన్నారు.

వృద్ధుడి దుర్మరణం


మృతుడు మోహన్ పవార్

గుమ్మఘట్ట: ద్విచక్ర వాహనాలు పరస్పరం ఢీకొన్న ఘటనలో ఓ వలస కూలీ మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు... మహారాష్ట్రకు చెందిన మోహన్‌పవార్ దగడ, దిలీప్ పవార్ కొంత కాలం క్రితం వలస వచ్చి రంగసముద్రం గ్రామం వద్ద బొగ్గులు కాల్చే పనిలో కూలీలుగా చేరారు. ఆదివారం వేపులపర్తి క్రాస్ వద్ద చికెన్ కొనుగోలు చేసుకుని ఇద్దరూ ద్విచక్రవాహనంపై రంగసముద్రానికి బయలుదేరారు. మార్గమధ్యంలో పూలకుంట గ్రామానికి చెందిన శివలింగ, ఆయన కుమారుడు హేమంత్ పొలంలో కూలీలకు భోజనం ఇచ్చి ద్విచక్ర వాహనంపై వెళుతూ ఎదురుగా వచ్చిన దిలీప్ పవార్ వాహనాన్ని ఢీకొన్నారు. ఘటనలో కిందపడిన మోహన్‌పవార్ అక్కడికక్కడే మృతి చెందాడు. తీవ్రంగా గాయపడిన మిగిలిన ముగ్గురినీ స్థానికులు వెంటనే రాయదుర్గంలోని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం అనంతపురంలోని జీజీహెచ్‌కు వైద్యులు రెఫర్ చేశారు. మృతుడికి భార్య మంగళాబాయి, కుమారుడు, కుమార్తె ఉన్నారు. రోడ్డుకిరువైపులా పెరిగిన కంపచెట్లే ప్రమాదానికి కారణమని స్థానికులు ఆరోపించారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

విద్యారంగాన్ని కాపాడుకోవడమే లక్ష్యం

- యూటీఎఫ్ రాష్ట్ర సహాధ్యక్షుడు సురేష్‌కుమార్
- ఘనంగా యూటీఎఫ్ జిల్లా స్వర్ణోత్సవ వేడుక



మాట్లాడుతున్న సురేష్‌కుమార్

రాయదుర్గం టౌన్: విద్య ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఉపాధ్యాయుల్ని చైతన్యపరిచి ప్రభుత్వ విద్యారంగాన్ని కాపాడుకోవడమే ప్రస్తుతం ఐక్య ఉపాధాయ ఫెడరేషన్ ప్రధాన లక్ష్యమని, ఇందుకోసం రాజీలేని పోరాటాలు చేపట్టనున్నట్లు యూటీఎఫ్ రాష్ట్ర సహాధ్యక్షుడు సురేష్‌కుమార్ పేర్కొన్నారు. రాయదుర్గంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల ఆడిటోరియంలో యూటీఎఫ్ జిల్లా స్వర్ణోత్సవ మహాసభలు ఆదివారం ఘనంగా జరిగాయి. ముఖ్య అతిథులుగా స్థానిక ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు, మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగేంద్రకుమార్, యూటీఎఫ్ రాష్ట్ర సహాధ్యక్షుడు సురేష్‌కుమార్, జిల్లా కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు గోవిందరాజులు, లింగమయ్య తదితరులు పాల్గొన్నారు. అంతకు ముందు ఉదయం వందలాది మంది ఉపాధ్యాయుల భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం జరిగిన సభలో సురేష్‌కుమార్ మాటాడారు. విద్యారంగం ప్రభుత్వ పరిధిలో ఉన్నప్పుడే అన్ని వర్గాలు అభివృద్ధి, సంక్షేమం వైపు పయనిస్తాయన్నారు.

జిల్లా నూతన కమిటీ ఎన్నిక..


యూటీఎఫ్ జిల్లా నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా వి.గోవిందరాజులు, గౌరవాధ్యక్షుడిగా ఎస్‌వీవీ రమణయ్య, సహ అధ్యక్షులుగా ఆర్.రామప్ప చౌదరి, ఎస్.సరళ, ప్రధాన కార్యదర్శిగా సి.లింగమయ్య, కోశాధికారిగా ఎం.రాఘవేంద్ర, కార్యదర్శులుగా బీజీ ప్రమీల, వి.అర్జున్, ఎస్.హనుమంతరెడ్డి, పి.అబ్బు వహాబ్‌కాన్, బి.సంజీవ కుమార్, హెచ్.రవికుమార్, కె.శేఖర్, వి.సుబ్బరాయుడు, వై.రాముడును ఎన్నుకున్నారు.

అతిగా మద్యం సేవించి వ్యక్తి మృతి


మృతిచెందిన సలాం

తాడిపత్రి టౌన్: అతిగా మద్యం సేవించి ఓ వ్యక్తి మృతిచెందాడు. వివరాలు... తాడిపత్రి రూరల్ పరిధిలోని ఆటోనగర్‌కు చెందిన సలాం (48) 4 నెలల క్రితం భార్యకు విడాకులిచ్చి ఒంటరిగా నివాసముంటున్నాడు. ఈ క్రమంలో మద్యానికి బానిసైన ఆయన ఆదివారం అతిగా మద్యం సేవించి అశోక్ పిల్లర్ సమీపంలో పడిపోయాడు. స్థానికులు గమనించేలోపు మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించి, మృతదేహాన్ని ఆస్పత్రికి తరలించారు. మృతుడికి ఇద్దరు పిల్లలు ఉన్నారు.

డీటీఎఫ్ వ్యవస్థాపకుడు రమణయ్య మృతి


పాతపల్లి రమణయ్య (ఫైల్)

అనంతపురం ఎడ్యుకేషన్: డెమోక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ (డీటీఎఫ్) వ్యవస్థాపకుడు, ఎల్‌ఎఫ్‌ఎల్ విశ్రాంత హెచ్‌ఎం పాతపల్లి రమణయ్య (64) అనారోగ్యంతో ఆదివారం కన్నుమూశారు. అనంతపురం రూరల్ పరిధిలోని పాపంపేట ప్రాథమిక పాఠశాల ఎల్‌ఎఫ్‌ఎల్ హెచ్‌ఎంగా పని చేస్తూ ఆయన ఉద్యోగ విరమణ పొందారు. కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతూ హైదరాబాద్‌లోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఆయన ఆరోగ్య పరిస్థితి విషమించడంతో మృతిచెందినట్లుగా కుటుంబసభ్యులు తెలిపారు. సంఘానికి, విద్యారంగానికి రమణయ్య చేసిన కృషిని ఈ సందర్భంగా డీటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మంజుల, పురుషోత్తం కొనియాడారు.

'కూటమి' హామీల అమలుకు ఉద్యమం

- ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ నేతల హెచ్చరిక

అనంతపురం ఎడ్యుకేషన్: ఎన్నికల సమయంలో ఉపాధ్యాయులు, ఉద్యోగులకు ఇచ్చిన హామీలను అధికారం చేపట్టగానే కూటమి పెద్దలు విస్మరించారని, ఈ క్రమంలో హామీలు నెరవేర్చాలంటూ ఉద్యమ బాట అనివార్యమైందంటూ ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ (ఏపీటీఎఫ్) నాయకులు పేర్కొన్నారు. ఆదివారం స్థానిక పొట్టి శ్రీరాములు ఉన్నత పాఠశాలలో ఏపీటీఎఫ్ జిల్లా సబ్ కమిటీ సమావేశం జరిగింది. ముఖ్య అతిథులుగా సంఘం రాష్ట్ర పూర్వ అధ్యక్షుడు రఘురామిరెడ్డి, పూర్వ కార్యదర్శి బి.నరసింహులు, రాష్ట్ర కార్యదర్శి పాతిరెడ్డి హాజరై, మాట్లాడారు. తాము అధికారంలోకి రాగానే 117 జీఓను రద్దు చేస్తామని, 12వ పీఆర్సీ, మంచి ఫిట్‌మెంట్ అమలు చేస్తామని, ఆలస్యమైతే మధ్యంతర భృతి చెల్లిస్తామని, బకాయి పీఎఫ్ లోన్లు, ఏపీజీఎల్ఐ లోన్లు, నగదు చెల్లింపునకు చర్యలు తీసుకుంటామని ఎన్నికలకు ముందు కూటమి పెద్దలు హామీ ఇచ్చారని గుర్తు చేశారు. అధికారం చేపట్టి ఆర్నెళ్లవుతున్నా ఏ ఒక్కటీ అమలు చేయకుండా ఉద్యోగ, ఉపాధ్యాయులను మోసం చేశారని మండిపడ్డారు. హామీలపై ప్రశ్నించకుండా అపార్ జనరేట్ లాంటి కొత్త సమస్యలు సృష్టిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సమావేశంలో ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వెంకటేష్, సిరాజుద్దీన్, ఉపాధ్యక్షులు నాగరాజు, మోహన్‌రెడ్డి, సతీష్‌కుమార్, కార్యదర్శులు రామాంజనేయులు, నరేష్, నాయకులు సర్దార్‌వలి, వెంకటరమణ, సుహైల్ పాల్గొన్నారు.


సమావేశంలో పాల్గొన్న ఏపీటీఎఫ్ నాయకులు

క్లుప్తంగా

ఐపీఎల్ తరహాలో ఉద్యోగుల క్రికెట్ టోర్నీ



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న మచ్చా రామలింగా రెడ్డి

అనంతపురం: ఐపీఎల్ తరహాలో ఉద్యోగుల క్రికెట్ టోర్నీ నిర్వహిస్తున్నామని వెటరన్స్ క్రికెట్ అసోసియేషన్ స్పోర్ట్స్ డెవలప్‌మెంట్ ట్రస్ట్ చైర్మన్ మచ్చా రామలింగా రెడ్డి అన్నారు. ఆదివారం ఫాదర్ ఫెర్రర్ ఉద్యోగుల క్రికెట్ టోర్నీ రెండో రౌండ్ పోటీలను ప్రారంభించారు. నిత్యం పని ఒత్తిడిలో ఉండే ఉద్యోగులకు ఐపీఎల్ తరహా టోర్నమెంట్ నిర్వహిస్తున్నామని, క్రీడా స్ఫూర్తితో క్రికెట్ ఆడాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆర్గనైజింగ్ కమిటీ సెక్రెటరీ విజయరాజు, సభ్యులు అడ్వకేట్ జయరాం రెడ్డి, శంకర్, బాలాజీ నాయక్, రఘు, షాకీర్ తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న భగవద్గీత అవధానం



భగవద్గీత విశేషాలను వివరిస్తున్న అవధానులు

అనంతపురం కల్చరల్: భగవద్గీత సకల సమస్యలకు పరిష్కార మార్గమని భగవద్గీత అవధాని బుర్ల తిక్కలక్ష్మన్న అన్నారు. ఆదివారం రాత్రి స్థానిక వేణుగోపాల నగర్‌లోని షిరిడి సాయిబాబా దేవాలయంలో భగవద్గీత అవధాన కార్యక్రమం జరిగింది. కర్నూలు జిల్లా హులేబీడు గ్రామానికి చెందిన అంధ ఉపాధ్యాయుడు, భగవద్గీత అవధాని గీతా విశేషాలను ఆసక్తికరంగా వినిపించారు. తెలుగు భాషా పండితులు వరప్రసాద్, సీనియర్ పండితుడు శివశంకరయ్య తదితరులు మాట్లాడుతూ.. తిక్క లక్ష్మన్న అద్భుతమైన జ్ఞానంతో గీతాప్రచారం చేస్తున్నారని తెలిపారు. ఆయన ఇప్పటి వరకు 78 గీతా యజ్ఞాలు పూర్తి చేయడం స్ఫూర్తిదాయకమన్నారు. అదేవిధంగా బ్రెయిలీ లిపి ద్వారా భగవద్గీతను అనువాదం చేశారని గుర్తు చేశారు. అనంతరం అవధానిని ఆలయ నిర్వాహకులు ఘనంగా సత్కరించారు.


13.5 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

అనంతపురం: నగరంలో రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్న ఓ వాహనాన్ని సీజ్ చేసినట్లు త్రీ టౌన్ సీఐ శాంతిలాల్ తెలిపారు. బియ్యం లోడుతో రాజీవ్ కాలనీ వైపు వెళుతున్న వాహనాన్ని ఆపి తనిఖీ చేయడంతో 13.5 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టుపడిందన్నారు. టీవీ టవర్ సమీపంలో నివాసముంటున్న మజ్జిగ హరికృష్ణ రేషన్ బియ్యాన్ని అక్రమంగా కర్ణాటకకు తరలిస్తున్నట్లుగా విచారణలో వెల్లడయిందన్నారు. హరికృష్ణతో పాటు డ్రైవర్ ప్రసన్నకుమార్, హరికృష్ణ మేనమామ ఈశ్వరయ్యపై కేసు నమోదు చేసినట్లు వివరించారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

అనంతపురం: స్థానిక మూడో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో ఆదివారం చేపట్టిన తనిఖీల్లో రాయుడు లాడ్జ్‌లో పేకాట ఆడుతూ పోలీసులకు 14 మంది పట్టుబడ్డారు. ఈ మేరకు సీఐ కె.శాంతిలాల్ తెలిపారు. జూదరుల నుంచి రూ.3,85,960 నగదు, 12 సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

ఇన్‌పుట్ సబ్సిడీ, ఇన్సూరెన్స్ ప్రకటించరా?



మాట్లాడుతున్న మాజీ మంత్రి శైలజానాథ్

అనంతపురం టవర్‌క్లాక్: ముఖ్యమంత్రి హోదాలో వచ్చిన చంద్రబాబు రాయలసీమకు ఏమి చేశారో చెప్పాలని మాజీ మంత్రి సాకే శైలజా నాథ్ డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. బాబు జిల్లా పర్యటనలో రైతుల గురించి ప్రస్తావించక పోవడం దారుణమన్నారు. సకాలంలో వర్షాలు కురవక, తుపాను వల్ల రైతులు పూర్తిగా నష్టపోయారని గుర్తు చేశారు. ఇన్‌పుట్ సబ్సిడీ, ఇన్సూరెన్స్ ప్రకటించకుండా వెళ్లడం ఏమిటని ప్రశ్నించారన్నారు. కనీసం రాయలసీమ గురించి ప్రత్యేకంగా ఏమి మాట్లాడక పోవడం విడ్డూరంగా ఉందన్నారు. చంద్రబాబు ప్రజలకు చేసిందేమీ లేదని ఎద్దేవా చేశారు. చిత్తశుద్ధి ఉంటే ఎన్నికలకు ముందు ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలను అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో బండ్లపల్లి ప్రతాప్ రెడ్డి, గాజుల వాసు, రామ్‌చరణ్ యాదవ్, శర్మాస్ వలి, సురేష్, నిశాంత్ రెడ్డి పాల్గొన్నారు.

అటకెక్కిన పౌర సేవలు

- గాడితప్పిన గ్రామ స్వరాజ్యం
- నిర్వీర్యమవుతున్న సచివాలయ వ్యవస్థ
- ఇప్పటికే వలంటీర్ల తొలగింపు
- పింఛన్ల పంపిణీకే పరిమితమైన సచివాలయ సిబ్బంది
- సేవలు అందక గ్రామీణుల అవస్థలు



ఆత్మకూరులోని సచివాలయం, రైతు సేవా కేంద్రం

ఆత్మకూరు: 'గత ప్రభుత్వం కన్నా మెరుగైన పాలన అందిస్తాం. సంపద సృష్టించి.. అర్హులకు సంక్షేమ పథకాలను సకాలంలో ఇస్తాం. వలంటీర్లకు రూ.10 వేల వేతనం అందజేస్తాం. పేదలకు పథకాల ద్వారా మరింత సాయం అందిస్తామని ఎన్నికల ప్రచారంలో చంద్రబాబు నాయుడు ఇచ్చిన హామీలు ఇవి'. తీరా గెలిచాక సూపర్ సిక్స్ హామీలను కూటమి ప్రభుత్వం అటకెక్కించింది. అధికారంలోకి వచ్చాక హామీల అమలులో విఫలమైంది. రాష్ట్రంలో జగనన్న ప్రభుత్వం తీసుకొచ్చిన సచివాలయ, వలంటీర్ వ్యవస్థను నిర్వీర్యం చేస్తోంది. ఇప్పటికే గ్రామ వలంటర్ వ్యవస్థ లేకుండా చేసిన కూటమి ప్రభుత్వం.. సచివాలయ వ్యవస్థను కూడా నీరుగార్చే ప్రయత్నం చేస్తోంది. సచివాలయ ఉద్యోగులను కేవలం పింఛన్ ఇవ్వడానికే పరిమితం చేస్తోంది. ఇచ్చిన హామీ మేరకు పథకాలు ప్రవేశపెట్టకుండా సచివాలయ వ్యవస్థను దెబ్బతీసేందుకు కుట్రలు పన్నుతోంది. గతంలో పథకాలన్నీ సచివాలయాల ద్వారా అమలు చేసేవారు. కూటమి ప్రభుత్వం వచ్చాక పథకాల ఊసే వినిపించడం లేదు. ప్రజలకు అవసరమైన రేషన్ కార్డులు, కొత్త పింఛన్లు, ఎన్టీఆర్ భరోసా కార్డులు అందించేందుకు చర్యలు తీసుకోవడం లేదు. కనీసం దరఖాస్తు చేసుకునేందుకు వెబ్‌సైట్లు కూడా తెరుచుకోలేదు.

నాడు కళకళ.. నేడు వెలవెల

ప్రస్తుతం రేషన్‌కార్డుల కోసం దరఖాస్తు చేసుకునేందుకు అర్హత ఉన్న లబ్ధిదారులు కాళ్లు అరిగేలా ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. పింఛన్ల కోసం దరఖాస్తు చేసుకోవడానికి సచివాలయాలకు రోజుకు ఒక్కో సచివాలయానికి పదుల సంఖ్యలో వెళ్తున్నారు. గతంలో ఏ పని కావాలన్నా ఒక వైపు గ్రామ వలంటీర్లు ఇంటింటికీ తిరిగి పథకాలతో పాటు ప్రభుత్వ కార్యాలయాల్లో అవసరమైన పనులు చేసేవారు. ప్రస్తుతం సచివాలయాలు నిర్వీర్యం అవుతుండటంతో ఏ పథకాలు అందక, సచివాలయాల్లో ఏ పనులు జరగక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

నియోజకవర్గంలో సచివాలయాలు, రైతు సేవా కేంద్రాల వివరాలు

మండలం	సచివాలయాలు	రైతు సేవా కేంద్రాలు
అనంతపురం రూరల్	25	16
ఆత్మకూరు	11	10
రాప్తాడు	13	11
చెన్నేకొత్తపల్లి	14	12
కనగానపల్లి	12	10
రామగిరి	11	11

కొత్త పింఛన్లు ఎప్పుడో?

సచివాలయాల్లో ప్రజా సేవలను క్రమేణా కూటమి ప్రభుత్వం తగ్గించింది. ప్రస్తుతం సచివాలయాల్లో కేవలం, ఆదాయ, కుల ధ్రువీకరణ పత్రాలు ఇతర సాధారణ సేవలు మాత్రమే అందుతున్నాయి. నూతన రేషన్‌కార్డులు, పింఛన్ల కోసం దరఖాస్తులు స్వీకరించడం లేదు. 50 ఏళ్లకే పింఛన్ ఇస్తామని ఊదరగొట్టిన చంద్రబాబు.. అధికారంలోకి వచ్చి ఐదు నెలలు గడుస్తున్నా నూతన పింఛన్లు మంజూరు చేయలేదు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అర్హులందరికీ ఎప్పటికప్పుడు పింఛన్లు అందజేసి, వైఎస్ జగన్ చరిత్రలో నిలిచిపోయేలా సేవలందించారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో పింఛన్ల కోసం వృద్ధులు దరఖాస్తు చేసుకునేందుకు సచివాలయాలకు ఆశగా వస్తున్నారు. ప్రభుత్వం నుంచి ఇంకా ఆదేశాలు రాలేదని సచివాలయ సిబ్బంది చెప్పడంతో నిరాశగా వెనుదిరుగుతున్నారు. అంతేకాకుండా ఈనెల 2వ తేదీ నుంచి రేషన్‌కార్డులకు దరఖాస్తులు చేసుకోవచ్చని ప్రభుత్వం చెబుతోంది. అయితే సచివాలయ సిబ్బందికి ఇప్పటిదాకా ఎటువంటి ఉత్తర్వులు అందలేదు. వెబ్‌సైట్‌లు ఓపెన్ అవుతాయా ? లేదా సర్వసర్లు సతాయిస్తాయా ? అనే అనుమానాలు తలెత్తుతున్నాయి.

సచివాలయం చుట్టూ తిరుగుతున్నా..

ఎన్నికల కోడ్‌కు ముందు వికలాంగుల పింఛన్ కోసం దరఖాస్తు చేశాను. దరఖాస్తు చేసిన తరువాత కొద్ది రోజులకు ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చింది. దీంతో ప్రభుత్వ కార్యకలాపాలు ఆగిపోయాయి. పింఛన్ కోసం దరఖాస్తు చేసి సుమారు ఎనిమిది నెలలు అవుతోంది. పింఛన్ మంజూరుకు ఇంత వరకు ఆన్‌లైన్‌లో వెబ్‌సైట్ ఓపెన్ కాలేదని సచివాలయ సిబ్బంది చెబుతున్నారు. రోజూ సచివాలయం చుట్టూ తిరుగుతున్నా పని పూర్తి కావడం లేదు. అసలు పింఛన్ మంజూరు చేస్తారా అని అనుమానం వస్తోంది.

– నారాయణ, ఆత్మకూరు

రేషన్ కార్డు ఎప్పడిస్తారో?

రేషన్‌కార్డు కోసం నెలల తరబడి ఎదురుచూస్తున్నాం. ఇంత వరకు రేషన్ కార్డుకు దరఖాస్తు చేసుకోవడానికి ప్రభుత్వం అవకాశం కల్పించ లేదు. గత వైఎస్సార్‌సీపీ హయాంలో సేవలు బాగా అందేవి. రేషన్‌కార్డులు, పింఛన్ల కోసం ఎప్పుడైనా సచివాలయానికి వెళ్లి దరఖాస్తు చేసుకునే వెసలుబాటు ఉండేది. ప్రస్తుతం కూటమి ప్రభుత్వంలో అటువంటి అవకాశం లేదు. అధికారంలోకి వచ్చి నెలలు గడుస్తున్నా.. కొత్త రేషన్‌కార్డు, పింఛన్లు ఎప్పుడు మంజూరు చేస్తారో తెలియడం లేదు.

– కుమార్, ఆత్మకూరు

రామకృష్ణారెడ్డి సేవలు మరువలేం



రామకృష్ణారెడ్డి మృతదేహానికి నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి

రామగిరి: వైఎస్సార్‌సీపీ బలోపేతానికి అహర్నిశలు శ్రమించిన రామకృష్ణారెడ్డి సేవలు మరువలేనివని మాజీ ఎంపీ గోరంట్ల మాధవ్, మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని చెర్లోపల్లికి చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు రామకృష్ణారెడ్డి గుండెపోటుతో మృతి చెందడంతో ఆదివారం బాధిత కుటుంబ సభ్యులను వారు పరామర్శించారు. రామకృష్ణారెడ్డి మృతదేహానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీ గోరంట్ల మాధవ్, మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి మాట్లాడుతూ.. వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాం నుంచి రామకృష్ణారెడ్డి పార్టీలో కొనసాగారన్నారు. వైఎస్సార్‌సీపీ బలోపేతానికి కృషి చేశారని కొనియాడారు. గతంలో డీలర్‌గా ప్రజలకు సేవలందించారని గుర్తు చేశారు. అనంతరం భార్య సువర్ణమ్మ, కుటుంబ సభ్యులను ఓదార్చారు. కార్యక్రమంలో రామగిరి, చెన్నేకొత్తపల్లి, కనగానపల్లి మండలాలకు చెందిన ఎంపీపీలు, జెడ్పీటీసీలు, కన్వీనర్లు, సర్పంచులు, ఎంపీటీసీలు, ఇతర నాయకులు పాల్గొన్నారు.

మెరుగైన వైద్య సేవలందిస్తాం



మాట్లాడుతున్న జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ కేఎస్ఎస్ వెంకటేశ్వర రావు

అనంతపురం మెడికల్: హెచ్ఐవీతో బాధపడుతున్న వారికి మెరుగైన వైద్య సేవలందించేలా చర్యలు తీసుకుంటామని జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ కేఎస్ఎస్ వెంకటేశ్వర రావు పేర్కొన్నారు. ఆదివారం ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని అనంత నెట్‌వర్క్ ఆఫ్ పాజిటివ్స్ ఆధ్వర్యంలో చిన్నపిల్లల విభాగంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో హెచ్ఐవీతో జీవిస్తున్న చిన్నారులకు పౌష్టికాహారం, దుప్పట్లు, ఐజినిక్ కిట్స్ అందజేశారు. ఈ సందర్భంగా సూపరింటెండెంట్ మాట్లాడుతూ.. హెచ్ఐవీతో జీవిస్తున్న వారికి ఏమైనా శస్త్రచికిత్సలు అవసరమైతే ప్రత్యేక చొరవ తీసుకుని చేయిస్తామన్నారు. ఐసీడీఎస్ పీడీ డైరెక్టర్ శ్రీదేవి మాట్లాడుతూ.. పిల్లలు పౌష్టికాహారంతో పాటు వ్యక్తిగత పరిశుభ్రత పాటిస్తూ..బాగా చదువుకోవాలన్నారు. ఆర్ఎంఓ డాక్టర్ హేమలత మాట్లాడుతూ.. హెచ్ఐవీతో జీవిస్తున్న వారిపై వివక్ష చూపకూడదన్నారు. కార్యక్రమంలో ఐఎంఏ అధ్యక్షుడు డాక్టర్ మురళీకృష్ణ, ఇన్నర్‌వీల్ క్లబ్ సభ్యులు శ్రీవల్లి, అనంత నెట్‌వర్క్ ఆఫ్ పాజిటివ్స్ అధ్యక్షులు రామకృష్ణా రెడ్డి, వీరాంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

అనర్హులకు పట్టం..!

- నగరపాలక సంస్థ రెవెన్యూలో ఇష్టారాజ్యంగా సీట్ల కేటాయింపు
- ఓ అధికారి చేతివాటం
- రూ.లక్షల్లో ముడుపులు తీసుకున్నట్లు ఆరోపణ

అనంతపురం కార్పొరేషన్: కూటమి ప్రభుత్వంలో అడ్డగోలు వ్యవహారాలు, అక్రమాలకు అడ్డూ అదుపు లేకుండా పోతోంది. అధికార పార్టీ అండదండలు, అధికారులకు డబ్బు సమర్పిస్తే కావాల్సిన ప్రాంతానికి పోస్టింగ్ ఇచ్చేస్తున్నారు. నగరపాలక సంస్థలోని రెవెన్యూ విభాగంలో అడ్డగోలు బాగోతాని తెరలేపారు. నిబంధనలకు విరుద్ధంగా కొందరికి సీట్లు మార్చడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

నిబంధనలు బేఖాతరు..

నగరపాలక సంస్థలో ఓ జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వర్తించే ఉద్యోగికి నిబంధనలకు విరుద్ధంగా రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ పోస్టు కట్టబెట్టారు. అదేవిధంగా రెవెన్యూ అధికారిగా పని చేసిన ఓ అధికారిని సూపరింటెండెంట్‌గా పంపించారు. వాస్తవంగా కింది స్థాయి పోస్టును ఓ ఆర్ఐకు కేటాయించారు. ఇద్దరికి రెవెన్యూ అధికారులుగా జీఓ ఉన్నా.. వారిని కాదని అనర్హులకు ఆర్ఓగా అవకాశం కల్పించారు. గతంలో నగరపాలక సంస్థలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లుగా పని చేసిన ఇదరిపై అవినీతి ఆరోపణలు ఉన్నాయి. వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వంలో కౌన్సిల్‌లో వారిపై కార్పొరేటర్లు బహిరంగంగా ఫిర్యాదు చేశారు. రూ.లక్షల్లో ముడుపులు డిమాండ్ చేస్తున్నారని.. ప్రజలు ఇబ్బందులను గురి చేస్తున్నట్లు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. కమిషనర్‌గా భాగ్యలక్ష్మి ఉన్న సమయంలో సదరు ఆర్ఐలను టౌన్ ప్లానింగ్, మెయిన్ హాల్‌కు మార్చారు. ఇప్పుడు అవినీతి ఆరోపణలు ఎదుర్కొన్న అధికారులను తిరిగి మళ్లీ అదే స్థానాలకు పంపడం చర్చనీయాంశంగా మారింది. దీంతో పాటుగా సదరు ఆర్ఐలకు అధిక రెవెన్యూ వార్డులు కేటాయించడం గమనార్హం. అదేవిధంగా 2014–19 సమయంలో ఆర్ఐగా చేసిన ఓ ఉద్యోగిపై అవినీతి ఆరోపణలు ఉన్నప్పటికీ.. ఆ ఉద్యోగికి మళ్లీ ఆర్ఐగా అవకాశం కల్పించారు. రెవెన్యూలో అడ్డగోలు స్థాన చలనాలకు సంబంధించి రూ.లక్షల్లో చేతులు మారినట్లు తెలుస్తోంది. నగరపాలక సంస్థలో ఓ అధికారికి పలువురు ఉద్యోగులు భారీగా సమర్పించుకున్నట్లు నగరపాలక సంస్థలో చర్చించుకుంటున్నారు.

కలెక్షన్స్ కోసమే మార్పాం..

ఇంటి, నీటి పన్ను వసూళ్లలో నిర్లక్ష్యంగా ఉన్నారు. పన్ను వసూళ్లపై ప్రభుత్వం సీరియస్‌గా ఉంది. ఇటువంటి సమయంలో కొందరికి స్థానాలు మార్చాల్సి వచ్చింది. జూనియర్ అసిస్టెంట్‌కు ఆర్ఐగా ఇచ్చే అధికారం కమిషనర్‌కు ఎందుకు లేదు? కొత్తగా అవకాశం ఇచ్చిన వారిలో మార్పు కన్పించకపోతే కచ్చితంగా వారిని వెనక్కు పంపుతాం. గతంలో పని చేసిన వారు లాంగ్ స్టాండింగ్‌లో విధులు నిర్వర్తిస్తున్నారు.

– నాగరాజు, కమిషనర్, నగరపాలక సంస్థ

'సూపర్ సిక్స్' అమలులో ప్రభుత్వం విఫలం



ప్రజా హక్కుల సభ పోస్టర్లు విడుదల చేస్తున్న నాయకులు, కార్యకర్తలు

అనంతపురం అర్బన్: ఎన్నికల్లో ఇచ్చిన సూపర్ సిక్స్ అమలు చేయడంలో కూటమి పభుత్వం ఘోరంగా విఫలమైందని సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ జిల్లా కార్యదర్శి టి.ఎస్.వలి అన్నారు. ఇక పవన్ కళ్యాణ్ రాష్ట్రంలో ప్రజా సమస్యలను పక్కనపెట్టి మతాలను రెచ్చగొడుతున్నారని మండిపడ్డారు. ఆదివారం స్థానిక పార్టీ కార్యాలయంలో ప్రజా హక్కుల సభ పోస్టర్లను నాయకులు, కార్యకర్తలు విడుదల చేశారు. ఈ సందర్భంగా వలి మాట్లాడుతూ.. ప్రజలను మభ్యపెట్టి అధికారంలోకి వచ్చిన తరువాత ఇచ్చిన హామీలను అమలు చేయని వారిని తరిమికొట్టాలన్నారు. ప్రభుత్వ వైఫలాలను ఎండగడుతూ ఈనెల 4వ తేదీన విజయవాడలో ప్రజా హక్కుల సభ చేపట్టినట్లు వెల్లడించారు. సూపర్ సిక్స్ పేరుతో ఎన్నికల్లోకి వెళ్లిన కూటమికి ప్రజలు అధికారం ఇచ్చారన్నారు. కూటమి ప్రభుత్వం గద్దెనెక్కి ఆరు నెలలు అవుతున్నా ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయలేదని మండిపడ్డారు. ఇచ్చిన హామీలను పక్కదోవ పట్టించేలా వ్యవహరిస్తున్నారని దుమ్మెత్తిపోశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కార్పొరేట్ సామ్రాజ్యానికి అధిపతిగా వ్యవహరిస్తూ రాష్ట్ర భవిష్యత్తును పూర్తిగా కార్పొరేట్ చేతుల్లో పెట్టబోతున్నారని ఆరోపించారు. ఇక పవన్ కళ్యాణ్ రాష్ట్రంలోని సమస్యలను పట్టించుకోకుండా మతాలను రెచ్చగొడుతున్నారని విమర్శించారు. ఇలా వ్యవహరించే నాయకులను ప్రజలు వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. వీటన్నింటికీ సమాధానంగా నిర్వహిస్తున్న ప్రజా హక్కుల సభను విజయవంతం చేయాలన్నారు. సభకు పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి దింపాకర్ భట్టాచార్య, కేంద్ర కమిటీ నాయకులు పాల్గొంటారన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కమిటీ సభ్యులు వేమన, జిల్లా నాయకులు సుజాత, బాలకృష్ణ, మహబూబ్ బాషా, తదితరులు పాల్గొన్నారు.

జనవరి 4న హనుమాన్ చాలీసా పారాయణం



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న హిందుత్వ సంస్థల ప్రతినిధులు

అనంతపురం కల్చరల్: అనంత వేదికగా జనవరి 4వ తేదీన పెద్ద ఎత్తున జరగనున్న సామూహిక హనుమాన్ చాలీసా పారాయణంలో అందరూ భాగస్వాములు కావాలని వక్తలు పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక ఆర్ఎఫ్ రోడ్డులోని లక్ష్మీవేంకటేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో సామూహిక హనుమాన్ చాలీసా పారాయణం పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నిర్వాహకుడు ప్రమోద్ స్వామి మాట్లాడుతూ.. హనుమాన్ చాలీసా ప్రచార సమితి, శ్రీపవనసుత యువజన సేవాట్రస్టు సంయుక్త ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని ఆర్ట్స్ కాలేజ్ వేదికగా 10 వేల మందితో పారాయణం జరిపిస్తున్నట్లు తెలిపారు. దేశంలో ప్రసిద్ధి చెందిన పీఠాల నుంచి పీఠాధిపతులు, రాజకీయ, ఆధ్యాత్మిక రంగాల ప్రముఖులు ఆత్మీయ అతిథులుగా విచ్చేసి సందేశమందిస్తారన్నారు. ఆధ్యాత్మిక శక్తి, ఐక్యతను చాటే పవిత్ర కార్యక్రమంలో అందరూ భాగస్వాములు కావాలని కోరారు. కార్యక్రమంలో పలు ధార్మిక సంస్థల ప్రతినిధులు, అయ్యప్ప మాలధారులు పాల్గొన్నారు.

అలరించిన 'సంగీత సాగర సమ్మేళనం



శాస్త్రీయ సంగీతంతో ఆకట్టుకున్న గాయని నిరంజన్ శ్రీనివాసన్

అనంతపురం కల్చరల్: నగుమోము కనరే.. రఘునందన వంటి సంకీర్తనలను ప్రఖ్యాత గాయని పుట్టమ్మాల్ శిష్యురాలు నిరంజన్ శ్రీనివాస్ ఆలపిస్తుంటే శ్రోతలు మంత్రముగ్ధులయ్యారు. ఆదివారం రాత్రి స్థానిక త్యాగరాజ సంగీత సభలో సప్త సరస్వతీ మణుల సుమధుర సంగీత సాగర సమ్మేళనం ఏర్పాటు చేశారు. సంగీత విభావరిలో పలువురు ప్రతిభావంతులైన మహిళలు వివిధ వాయిద్యాలతో ఆకట్టుకున్నారు. త్యాగరాజ సంగీత సభ కార్యదర్శి ప్రభావతి నేతృత్వంలో సాగిన సంగీతోత్సవంలో త్యాగయ్య, పురంధరదాసు, అన్నమాచార్య కీర్తనలు ఆలపించారు. డాక్టర్ అనంత లక్ష్మి వయిలిన్, రంజని మృదంగం, రమ ఘటం, బోర్సింగ్‌పై విజయలక్ష్మి తదితరులు వాయిద్య సహకారం అందించారు. ఈ సందర్భంగా సంగీత సభ వ్యవస్థాపకులు జ్ఞానేశ్వరరావు ఉత్తార్కర్, సభ తొలి కార్యదర్శిగా పని చేసిన పద్మజ సురేష్ మాట్లాడుతూ.. కళాకారులు నగరంలోని త్యాగరాజ సంగీత సభను అద్వితీయమైన కళాసంపత్తితో సుసంపన్నం చేశారని తెలిపారు. భవిష్యత్తులోనూ సంప్రదాయ శాస్త్రీయ నృత్యాలు, సంగీత కచేరీలు నిర్వహించాలని తీర్మానించడం హర్షణీయమన్నారు. కార్యక్రమంలో జనప్రియ కవి ఏలూరు యంగన్న, చార్టెడ్ అకౌంటెంట్ హరిశ్చంద్ర రామ, సాయిబాబా కాలేజ్ పీఎల్ఎన్ రెడ్డి, సీనియర్ న్యాయవాది నామ సేవ హరికృష్ణ పాల్గొన్నారు.

పోలీసుల అదుపులో యూట్యూబర్

అనంతపురం: అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్‌కు వ్యతిరేకంగా యూట్యూబ్ చానల్‌లో వీడియోలు ప్రసారం చేసిన ఓ యూట్యూబర్‌ను వన్‌టౌన్ పోలీసులు ఆదివారం సాయంత్రం అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. ఎంటూఎం చానల్ పేరుతో యూట్యూబ్‌లో పలు వీడియోలను ప్రసారం చేసినట్లు సమాచారం. 'ఎస్పీ జగదీష్.. ఇటు వైపు చూడు అంటూ' వీడియోలను పోస్ట్ చేశారనే ఆరోపణలతో యూట్యూబర్‌ను అరెస్ట్ చేసినట్లు తెలిసింది.

ముగిసిన 'కార్తీక' పూజలు



అన్నదానం చేస్తున్న మాజీ మేయర్ రాగే పరశురాం

అనంతపురం కల్చరల్: నెల రోజులుగా భక్తిభావాన్ని పెంచిన కార్తీకం మాసం ఆదివారం ముగిసింది. నగరంలోని పలు దేవాలయాల్లో కార్తీక అమావాస్య పూజలను ఘనంగా నిర్వహించారు. స్థానిక ఉమానగర్‌లోని రేణుకా ఎల్లమ్మ ఆలయంలో మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు పెద్ద ఎత్తున అన్నదానం జరిగింది. మాజీ మేయర్ రాగే పరశురాం, కార్పొరేటర్ బండి నాగమణి ముఖ్య అతిథులుగా హాజరై అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. అంతకు ముందు ఆలయంలో అమ్మవారికి అభిషేకాలు, ప్రత్యేక అలంకార సేవలు, సామూహిక కుంకుమార్చన నిర్వహించారు. ఈ సందర్భంగా దాతలను సత్కరించారు. రాగే పరశురాం మాట్లాడుతూ.. ఏటా కార్తీక మాసమంతా విశేష పూజలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఇందుకోసం అందరూ సహకరించడం ఆనందంగా ఉందన్నారు. రానున్న రోజుల్లో కార్తీక పూజలను పెద్ద ఎత్తున నిర్వహించాలని తీర్మానించామన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు నాగరాజు, శేఖర్, గోసల లక్ష్మన్న, ప్రసన్న, మంజు, నవీన్, గోవింద తదితరులు పాల్గొన్నారు. అలాగే స్థానిక హెచ్చెల్సీ కాలనీలోని శ్రీమంజునాథ ఆలయం, శృంగేరీ శారదా శంకర మఠం తదితర చోట్ల కార్తీక అమావాస్య పూజలు భక్తిశ్రద్ధలతో జరిగాయి.

వడ్డెర్ల సంఘం జిల్లా కమిటీ ఎన్నిక



నూతన కమిటీ సభ్యులను సన్మానిస్తున్న దృశ్యం

అనంతపురం రూరల్/అనంతపురం ఎడ్యుకేషన్: నగరంలోని 5వ రోడ్డులో ఆదివారం వడ్డెర్ల సంఘం నాయకులు సమావేశం నిర్వహించారు. వడ్డెర్ల సంఘం నూతన జిల్లా కమిటీని రాష్ట్ర అధ్యక్షుడు దేవళ్ల మురళీ ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా కుంచపు వెంకటేష్, జిల్లా ప్రధాన కార్యదర్శిగా పరిగి హనుమన్న, జిల్లా ఉపాధ్యక్షులుగా నాగరాజు, శ్రీనివాసులు, కోశాధికారిగా పెద్ద మారెప్ప, కార్యదర్శిగా వెంకటపతి, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా పీట్ల సుధాకర్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు దేవళ్ల మురళీ మాట్లాడుతూ.. అత్యంత వెనుకబడిన వడ్డెర్లకు రాజకీయ ప్రాధాన్యత కల్పించాలన్నారు. నామినేటెడ్ పదవులు కేటాయించాలని కోరారు. క్వారీల్లో వడ్డెర్లకు 30 శాతం వాటా ఇవ్వాలన్నారు. వడ్డెర్లకు సబ్సిడీపై యంత్రాలు అందజేయాలన్నారు. పని ప్రదేశాల్లో ప్రమాదాలు సంభవించి ప్రాణాలు కోల్పోయి వారికి రూ.25 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. అత్యంత వెనుకబడిన వడ్డెర్లను ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకోవాలని సూచించారు. వడ్డెర్లను ఎస్టీ జాబితాలో చేర్చితేనే న్యాయం జరుగుతుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆ దిశగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు వడ్డే అంజినప్ప, రామాంజనేయులు, మునిస్వామి, నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

వక్ఫ్ బిల్లును వ్యతిరేకించాలి

అనంతపురం కల్చరల్: పార్లమెంట్‌లో వక్ఫ్ బిల్లు ప్రవేశపెట్టకుండా వ్యతిరేకించాలని ఆల్ మేవా నాయకులు ఎంపీ లక్ష్మీనారాయణను కోరారు. ఆదివారం ఆల్ మేవా (మైనార్టీ ఉద్యోగుల సంక్షేమ సంఘం) నాయకులు ఎంపీని కలసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పలువరు ఆల్ మేవా నాయకులు మాట్లాడుతూ.. ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో అన్ని వర్గాలతో పాటూ ముస్లిం సమాజానికి అండగా ఉంటామని ఇచ్చిన హామీని కూటమి ప్రభుత్వం నిలబెట్టుకోవాలన్నారు. వక్ఫ్ బోర్డు ఆస్తుల ఆదాయం ద్వారా సమాజంలోని పేద విద్యార్థుల భవిష్యత్తు కోసం ప్రోత్సహించడం, ముస్లిం శ్మశాన వాటికల అభివృద్ధి, పేద ప్రజల సంక్షేమం కోసం వినియోగించాలన్నారు. ముస్లింల అస్థిత్వానికి ఎంతో ప్రమాదకరంగా ఉన్న బిల్లు వల్ల చాలా మంది తీవ్రంగా నష్టపోతారని గుర్తు చేశారు. వక్ఫ్‌బోర్డు ఆస్తులు దేవుడికి సంబందించినవని.. ఒక్కసారి అప్పగించిన తర్వాత వాటిని వెనక్కు తీసుకునే అధికారం దాతలకు కూడా లేదని స్పష్టం చేశారు. నాలుగు శతాబ్దాలుగా ఉన్న మసీదులు, దర్గాలు, శ్మశాన వాటికల పత్రాలను చూపించడం సాధ్యం కాదని తెలిసి కూడా చట్టం తీసుకుని రావాలనుకోవడం అన్యాయమన్నారు. ఎన్ఆర్‌సీసీ కంటే ప్రమాదకరమైన బిల్లును కచ్చితంగా వ్యతిరేకించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు షేక్షావలి, జిలాన్, అబ్దుల్ రసూల్, మహబూబ్ బాషా, దౌలా తదితరులు పాల్గొన్నారు.